సాక్షి
కాకినాడ

గురువారం | 30 | మే | 2024



రూ.1,01,116 విరాళం

సఖినేటిపల్లి:అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలోని నిత్య అన్నదాన ట్రస్టుకు అప్పన చంద్రరావు (గుడిమెళ్లంక) రూ.1,01,116 విరాళం అందజేశారు.



నిత్యాన్నదాన పథకానికి రూ.1,01,116

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి కర్రి వేంకట శ్రీనివాసరెడ్డి దంపతులు (అనపర్తి) రూ.1,01,116 విరాళాన్ని సమర్పించారు.

గరిష్ఠం/కనిష్ఠం
43.0°/31.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	43.0	30.0
కాకినాడ	39.9	29.4
అమలాపురం	41.0	31.0

న్యూస్‌రీల్

ప్రశాంతంగా సప్లిమెంటరీ పరీక్షలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పదో తరగగతి, ఇంటర్మీయెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఐదవ రోజు బుధవారం జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. పదో తరగతి భౌతికశాస్త్రం పరీక్షకు 3,796 మంది హాజరుకాగా 2,049 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్మీయెట్ ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షకు 8,252 మంది హాజరుకాగా 482 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 2,858 మంది హాజరుకాగా 146 మంది పరీక్ష రాయలేదని జిల్లా ఇంటర్మీయెట్ అధికారి నూకరాజు తెలిపారు.

సర్టిఫికెట్ల పరిశీలనకు 175 మంది హాజరు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నిర్వహించిన పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలనకు 175 మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా కోఆర్డినేటర్, ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు తెలిపారు. విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అనంతరం ధ్రువీకరణ పత్రం అందజేశామన్నారు. గురువారం 43,001 నుంచి 59,000 వరకు ర్యాంకు గల విద్యార్థులకు సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తెలిపారు.

అనుమతులు ఉంటేనే వైద్య పరీక్షలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రభుత్వ అనుమతులు పొందిన సంతాన సాఫల్య కేంద్రాల్లో మాత్రమే వైద్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం ఆవ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఏఆర్‌టీ క్లినిక్‌ను ఆయన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ లేని కేంద్రాలలో ఏ విధమైన వైద్యం చేయించుకోరాదన్నారు. ఆవ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఏఆర్ టీ క్లినిక్ లెవెల్ -2 కోసం దరఖాస్తు చేయడంతో ఆసుపత్రిలో మౌలిక వసతులు పరిశీలించినట్టు చెప్పారు. తనిఖీ బృందం సభ్యులు డాక్టర్ అక్కమాంబ, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి విద్యాకానుక



మనబడి నాడు-నేడు పనులపై సమీక్షిస్తున్న ఏపీసీ మధుసూదనరావు

రాయవరం: వచ్చే నెల 12న పాఠశాలల పునః ప్రారంభం రోజునే ప్రతి విద్యార్థికి విద్యాకానుక అందజేసే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారని డిప్యూటీ కలెక్టర్, సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు తెలిపారు. రాయవరం మండలంలో శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యాకానుక-5 స్టాక్ పాయింట్‌ను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 22 మండలాల్లో స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేయడంతో పాటు, విద్యాకానుక-5 స్టాక్‌ను సక్రమంగా, సమర్థవంతంగా పాఠశాలలకు చేరవేసేందుకు ప్రతీ కాంపొనెంట్‌కు ఒక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. అలాగే పాఠశాల స్థాయిలో కూడా కమిటీల ఏర్పాటుకు ఉత్తర్వులు ఇచ్చామని అన్నారు, జిల్లాలో మండల స్టాక్ పాయింట్లకు పూర్తి స్థాయిలో నోట్ బుక్, బెల్టులు చేరుకున్నాయన్నారు. సింగిల్ రూల్, బ్రాడ్ రూల్, వైట్ 6.62లక్షల నోట్ పుస్తకాలు, 66,549 బెల్టులు చేరుకున్నాయన్నారు. దశలవారీగా పాఠ్య పుస్తకాలు మండల స్టాక్ పాయింట్లకు చేరుకుంటున్నాయన్నారు. 51,897 మంది బాలికలకు 47,729 మంది బాలురకు షూలు, 11,557 ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, 99,232 వంతున యూనిఫామ్, స్కూల్ బ్యాగ్స్ మండల స్టాక్ పాయింట్లకు చేరుకోవాల్సి ఉందన్నారు. రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి వచ్చిన సమాచారం మేరకు జూన్ 5వ తేదీ నాటికి పూర్తి స్థాయిలో మెటీరియల్ చేరుతుందన్నారు. మండల విద్యాశాఖాధికారులు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణలకు పలు సూచనలు ఇచ్చారు. అంతకు ముందు ఆయన మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పాఠశాల హెచ్ఎంలతో మనబడి నాడు-నేడు పనులపై సమీక్షించారు.

వెబ్ కౌన్సెలింగ్‌కు 63 మంది హాజరు

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం వైపీఎస్ అండ్ బీఆర్ఎం కళాశాలలో జరిగిన పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్‌కు బుధవారం 63 మంది విద్యార్థులు హాజరైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె.విశాల తెలిపారు. 27001 ర్యాంకు నుంచి 43000 ర్యాంకు వరకూ వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. గురువారం 43001 నుంచి 59000 ర్యాంకు వరకూ వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.

మళ్లీ పెన్షన్ టెన్షన్

- తలలు పట్టుకుంటున్న అవ్వాతాతలు
- తలుపు తట్టి పింఛనిచ్చిన వలంటీర్లు దూరం
- జిల్లాలో 2.80 లక్షల మంది పింఛనుదారులు
- 2,13,195 మందికి బ్యాంకుల్లోనే నగదు జమ



బ్యాంకులో పింఛన్లు తీసుకునేందుకు వేచి ఉన్న లబ్ధిదారులు

కాకినాడ సిటీ: అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగుల ముఖాల్లో చిరునవ్వు చిన్నబోతోంది. ఒకటో తారీఖు వస్తోందంటే, పింఛన్ అందుకుంటామన్న ఆనందం కంటే, బ్యాంకులు, సచివాలయాల వద్ద పడే వ్యయ ప్రయాసలు గుర్తుకొచ్చి గుబులు రేగుతోంది. రెండు నెలలుగా పింఛన్ కోసం వారు అనుభవించిన అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఇప్పుడు మరో నెల వస్తోంది. తిప్పలు మాత్రం తప్పేలా లేకపోవడంతో ఈ ఎండల్లో ఎలా భగవంతుడా? అంటూ వాపోతున్నారు.

గత ప్రభుత్వంలో పింఛన్ కోసం అధికారుల ముందు చేతులు కట్టుకుని, వారు ఎప్పుడిస్తే అప్పుడే మహద్భాగ్యం అనుకునే పరిస్థితి ఉండేది. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు సామాజిక గౌరవాన్ని పెంచాలన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే పింఛన్ల పంపిణీతో నెరవేరింది. లబ్ధిదారుల గౌరవానికి భంగం లేకుండా వారి జీవితాలకో భరోసా వచ్చింది. అనారోగ్యంతో ఆస్పత్రుల్లో ఉన్నా తప్పనిసరి పరిస్థితుల్లో వేరే ఊరికి వెళ్లినా, వలంటీర్లు వారిని వెతుక్కుంటూ వెళ్లి ప్రతి నెలా ఒకటో తేదీనే వారి యోగక్షేమాలు తెలుసుకుని మరీ, పింఛన్ అందించేవారు. టీడీపీ, దాని మిత్రపక్షాల కుట్రలు, ఎన్నికల సంఘం ఆదేశాలతో గత రెండు నెలలుగా పింఛన్ అందుకోవడానికి లబ్ధిదారులు పడ్డ తిప్పలు వర్ణనాతీతం. ఇప్పుడు జూన్ నెల పింఛన్ కోసం కూడా అవే తిప్పలు తప్పని పరిస్థితి.

అవ్వాతాతలకు తలకు మించిన భారం

కాకినాడ జిల్లాలో ప్రతి నెలా మొత్తం 2,80,662 మందికి రూ.83.16 కోట్ల నగదును ప్రభుత్వం విడుదల చేస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి నేటి వరకు ప్రతీ నెలా నగదు లబ్ధిని వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే అందించింది. ఐదేళ్లలో పింఛనుదారులకు రూ.4,920 కోట్ల లబ్ధిని ఇంటి వద్దే అందించింది. తాజాగా పెంచిన రూ.3 వేల పింఛన్‌తో ప్రధాన కేటగిరిలైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలతోపాటు ఇతర పింఛన్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదు అందించేవారు. ఎన్నికల నేపథ్యంలో విపక్షాల ఫిర్యాదుపై ఈసీ ఆదేశాల మేరకు వీరిలో 2,13,195 మందికి ఆధార్‌తో లింక్ అయిన బ్యాంక్ ఖాతాలలో జమ చేస్తున్నారు. మిగిలిన 67,467 మంది వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధితో బాధపడే వారికి రూ 19.20 కోట్లు ఇంటి వద్దనే పంపిణీ చేయనున్నారు. ఈ క్రమంలో బ్యాంకుల్లో నగదు తీసుకోవడం అవ్వాతాతలకు తలకు మించిన భారంగా మారింది.

భయపెడుతున్న పాత రోజులు

టీడీపీ ప్రభుత్వ హయాంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, పింఛన్లు తీసుకోవాలంటే తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రతి నెలా ఒకటో తేదీ దాటినా, పింఛన్ ఎప్పుడు ఇస్తారో తెలియక ప్రభుత్వ కార్యాలయాల వద్ద పడిగాపులు కాచేవారు. బారులు తీరి గంటల కొద్దీ క్యూలో నిల్చున్న రోజులను నేటికీ మరిచిపోలేదు. వేసవి కాలంలో క్యూలో నిల్చోలేక సొమ్మసిల్లిన సందర్భాలు అనేకం. ఆ జ్ఞాపకాలు వృద్ధుల్ని వెంటాడుతూనే ఉన్నాయి. వ్యవస్థలను మేనేజ్ చేసే చంద్రబాబు తమకు పాత రోజులు గుర్తు చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంత వేగంగా ఈ కష్టాలు తీరతాయా? అని నిరీక్షిస్తున్నారు.

ఇంకెన్ని రోజులు మాకీ బాధలు



ఒకటో తేదీ వస్తోందని ఆనందపడాలో, పింఛన్ కోసం పడే తిప్పలు తలచుకుని బాధపడాలో అర్థం కావట్లేదు. ఇంటి నుంచి పట్టణంలో ఉన్న బ్యాంక్‌కు వెళ్లగలిగే పరిస్థితిలో లేను. నా వయసు 80 ఏళ్లు. ఇంటి నుంచి బయటకే రాలేను. అలాంటిది బ్యాంక్‌కి నన్నెవరు తీసుకెళతారు. వలంటీర్ల ద్వారా పింఛను పంపిణీ చేయకుండా అడ్డుకోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నా, గత నెలలో పడిన బాధలు మళ్లీ గుర్తుకొస్తున్నాయి. ఇంకెన్ని రోజులు మాకీ బాధలు.

– పి.లక్ష్మి, పింఛన్ లబ్ధిదారు, కాకినాడ

నాటి అవస్థలు గుర్తుకొస్తున్నాయి



నా పేరు కొండ్రు సీతారామ్. నాది కాకినాడలో సాంబమూర్తినగర్. అంధుడైన నాకు వికలాంగు పెన్షన్ వస్తోంది. ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి తలుపు తట్టి పింఛన్ సొమ్ము చేతిలో పెట్టేవారు. రెండు నెలలుగా పింఛన్ సొమ్ము బ్యాంకు ఖాతాల్లో వేస్తుండడంతో గంటల తరబడి నిలుచుని ఉండాల్సి వస్తోంది. గతంలో టీడీపీ పాలనలో పింఛన్ కోసం రెండు, మూడు రోజుల పాటు మండుటెండల్లో పడిగాపులు కాసిన పరిస్థితులు మళ్లీ గుర్తుకు వస్తున్నాయి.

– కొండ్రు సీతారామ్, సాంబమూర్తినగర్, కాకినాడ

సత్యదేవుని హుండీ రాబడి రూ.1.90 కోట్లు

రికార్డు స్థాయిలో 36 రోజుల ఆదాయం



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి హుండీల ద్వారా 36 రోజులకు గాను రికార్డు స్థాయిలో రూ.1,90,41,964 ఆదాయం సమకూరింది. దేవస్థానంలోని హుండీలను బుధవారం తెరిచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. ఈ కానుకల్లో నగదు రూ.1,84,27,716 కాగా, చిల్లర నాణేలు రూ.6,14,248 వచ్చాయని దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ తెలిపారు. వీటితోబాటు బంగారం 168 గ్రాములు, వెండి 1,075 గ్రాములు వచ్చిందని ఆయన తెలిపారు. గత నెల 18 వ తేదీ నుంచి 24 వ తేదీ వరకు సత్యదేవుని వార్షిక దివ్యకల్యాణ మహోత్సవాల సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు దేవస్థానానికి తరలి వచ్చారు. ఈ నెల 13వ తేదీన జరిగిన ఎన్నికల పోలింగ్ అనంతరం ప్రతీ రోజూ కూడా సత్యదేవుని ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. వారంతా పెద్ద మొత్తంలో హుండీలలో కానుకలు సమర్పించడంతో రికార్డు స్థాయిలో రోజుకు సరాసరిన రూ.5,28,943 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

హుండీల ద్వారా విదేశీ కరెన్సీ ...

సత్యదేవుని హుండీల ద్వారా పెద్ద మొత్తంలో విదేశీ కరెన్సీ కూడా లభించింది. అమెరికా డాలర్లు 83, ఖతార్ రియల్స్ 12, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ కువైట్ దీనార్‌లు 20, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దీనార్లు ఐదు, ఆస్ట్రేలియా డాలర్లు 18, మలేషియా రింగిట్ ఒకటి, ఒమన్ బైసాలు వంద, థాయ్‌లాండ్ బాత్స్ 20 లభించాయి. హుండీ లెక్కింపులో డిప్యూటీ ఈఓ రమేష్‌బాబు, దేవస్థానం సిబ్బందితో బాటు పలు స్వచ్ఛంద సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తులు

రత్నగిరి సత్యదేవుని ఆలయం బుధవారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడింది. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి సన్నిధికి తరలి వచ్చారు. సత్యదేవుడిని దర్శించిన అనంతరం భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి ప్రదక్షిణ చేశారు. స్వామివారి వ్రతాలు రెండువేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు నాలుగు వేల మంది భక్తులకు సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో ఉచిత భోజన సౌకర్యం కలుగచేశారు.

నేడు స్వామివారి నిజరూప దర్శనం

గురువారం సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, ఈశ్వరుడు (శివలింగాకారం) ఎటువంటి అలంకరణ లేకుండా శిలారూపంలో భక్తులకు నిజరూప దర్శనమివ్వనున్నారు.

లెక్కింపుపై ప్రత్యేక దృష్టి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ నివాస్, పాల్గొన్న ఆర్వోలు, ఏఆర్వోలు, సూపర్‌వైజర్లు

అధికారులకు కలెక్టర్ సూచన

కాకినాడ సిటీ: ఓటర్ల నిజమైన ఎంపిక సరైన ఓట్ల లెక్కింపులోనే వ్యక్తమవుతుందని, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి సిబ్బంది పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ఆర్వోలు, ఏఆర్వోలు, సూపర్‌వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నివాస్, జాయింట్ కలెక్టర్, పిఠాపురం రిటర్నింగ్ అధికారి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియలో అనుసరించాల్సిన విధానం, ప్రాథమిక ఓట్ల లెక్కింపు, చెల్లుబాటు అయిన ఓట్ల లెక్కింపు, వివరాల నమోదు వంటి అంశాలపై ఆర్వోలు, ఏఆర్వోలు, సూపర్‌వైజర్లకు అవగాహన కల్పించిన సందర్భంగా మాట్లాడారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కార్యక్రమం అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా చేపట్టాలన్నారు. ఓటర్ల నిజమైన ఎంపిక సరైన లెక్కింపులోనే వ్యక్తమవుతుందనే విషయాన్ని గుర్తించి, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి సిబ్బంది పని చేయాలని కలెక్టర్ తెలిపారు. జూన్ 4 ఉదయం 8 గంటల నుంచి పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రారంభం అవుతుందని, పార్లమెంట్‌కు 14 టేబుల్స్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 25 టేబుళ్లు, మొత్తం 39 టేబుళ్ల పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ప్రత్యేకంగా, అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఆయా నియోజకవర్గాల ఈవీఎంల కౌంటింగ్ సెంటర్ల వద్ద నిర్వహిస్తామని కలెక్టర్ నివాస్ తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ చెల్లుబాటు, చెల్లుబాటు కానివి నిర్ధారణ చేసే విషయంలో ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవాలన్నారు. ఇందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు చేసిన సూచనలపై అధికారులు ప్రత్యేక అవగాహన పెంపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రిటర్నింగ్ అధికారులు, ఏఆర్వోలు, సూపర్‌వైజర్లు, ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

హ్యాపీగా.. హాకీ



డీఎస్ఏ హాకీ యాస్ట్రో టర్ఫ్ మైదానంలో క్రీడాకారుల కసరత్తులు

- కాకినాడలో నాలుగు చోట్ల ఉత్సాహంగా వేసవి శిక్షణ
- 150 మంది హాజరు
- తీర్చిదిద్దుతున్న శిక్షకులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఇష్టమైన క్రీడలో శిక్షణ పొందుతూ విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటున్నారు. ముఖ్యంగా మన దేశ జాతీయ క్రీడ అయిన హాకీలో పలువురు శిక్షణ పొందుతున్నారు. నగరంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) క్రీడా మైదానంలోను, సాలిపేట బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బుడంపేట, గాంధీనగర్ మున్సిపల్ హైస్కూళ్లలో హాకీ వేసవి ఉచిత శిక్షణ శిబిరం ఉత్సాహంగా జరుగుతోంది. డీఎస్ఏ హాకీ టర్ఫ్ మైదానంలో కోచ్ నాగేంద్ర, మున్సిపల్ పాఠశాలల్లో కోచ్‌లు రవిరాజు, సూరిబాబు ఆధ్వర్యాన ఉదయం, సాయంత్రం వేళల్లో జరుగుతున్న ఈ శిక్షణలో సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. ప్రతి రోజూ ఉదయం 5.30 నుంచి 8.30, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకూ శిక్షణ ఇస్తున్నారు. వీరికి ఇటు ఫిట్‌నెస్, అటు హాకీ మైదానంలో రాణించడానికి మెళకువలు నేర్పిస్తున్నారు. డీఎస్ఏలో క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ కుమార్ పర్యవేక్షణ, సూచనలతో శిబిరం జరుగుతోంది.

హాకీ విశేషాలివీ..

- ఫుట్‌బాల్, క్రికెట్ మాదిరిగానే మైదానాల్లో ఆడే ఆట హాకీ. ఇది 11 మంది ఆటగాళ్లతో రెండు జట్ల మధ్య జరుగుతుంది. మొత్తం సభ్యులు సంఖ్య 16. బంతిని ఒంపుగా ఉన్న కర్రతో గట్టిగా కొడుతూ ఆడతారు. ప్రత్యర్థుల గోల్ లోపలకు బంతిని స్టిక్‌తో కొట్టి పంపించాలి. దీనిని ఫీల్డ్ హాకీ అంటారు.
- బ్రిటిష్ హాకీ అసోసియేషన్ 1896 జనవరి 18న ఆవిర్భవించడంతో ఆధునిక హాకీ క్రీడకు అసలైన గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత ఇంగ్లండ్‌లో కొన్ని వందల హాకీ క్లబ్బులు ప్రారంభమయ్యాయి. మహిళల విభాగంలో తొలి పోటీలు 1887లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో నిర్వహించారు. ఆ తర్వాత మొదటి లేడీస్ క్లబ్ లండన్‌లో ప్రారంభమైంది.
- మన దేశంలో హాకీ క్రీడను తొలిసారిగా పరిచయం చేసింది కూడా బ్రిటిష్ వారే. మొదట్లో ఈ క్రీడ బ్రిటిష్, భారత్ సైనికులకు మాత్రమే పరిమితమైంది. హాకీలో బేసిక్స్‌ను భారతీయ కంటోన్మెంట్లన్నింటిలోనూ నేర్పించారు.
- అద్భుతమైన ఆటతీరు కనబరిచిన మన ప్రఖ్యాత హాకీ ఆటగాడు ధ్యాన్‌చంద్ సిపాయిగా ఉన్నప్పుడే ఈ క్రీడను అభ్యసించాడు. మన దేశంలో మొట్టమొదటి హాకీ క్లబ్ కోల్‌కతాలో ఏర్పడింది.
- హాకీ మైదానం దీర్ఘచతురస్రాకారంలో ఉంటుంది. రెండు జట్ల వైపు చెరొక గోల్ పోస్టు ఏర్పాటు చేస్తారు.
- ఫీల్డ్‌కు నాలుగు మూలల్లో జెండా కర్రలుంచాలి. వీటికి ఉండే జెండాల పొడవు, వెడల్పు 300 మిల్లీ మీటర్లు మించరాదు.
- బంతి చుట్టుకొలత 224 మిల్లీమీటర్ల నుంచి 235 మిల్లీమీటర్ల మధ్య ఉంటుంది. బరువు 156 గ్రాముల నుంచి 136 గ్రాముల మధ్య ఉంటుంది.
- సాధారణంగా హాకీలో గోల్‌కీపర్, అటాకర్, డిఫెన్స్, హిట్, షాట్, ఎట్ గోల్, పుష్, ఫ్లిక్, స్కూప్, ఫోర్‌హ్యాండ్, ప్లేయింగ్, డిఫెన్స్ పదాలు వాడతారు.
- డి.జయంత్ కుమార్ వ్యవస్థాపకుడిగా మన జిల్లాలో హాకీ సంఘం 1984లో ప్రారంభమైంది. 1998లో జిల్లా మహిళా హాకీ సంఘాన్ని వి.రవిరాజు ఆధ్వర్యాన ప్రారంభించారు.

చాలా ఫిట్‌నెస్ కావాలి



హాకీలో రాణించాలంటే చాలా ఫిట్‌నెస్ కావాలి. ఇది మైదానం అంతా తిరుగు తూ ఆడే ఆట. వేసవి శిక్షణకు వచ్చిన క్రీడాకారులకు ఫిట్‌నెస్‌తో పాటు, హాకీ క్రీడలో తర్ఫీదునిస్తున్నాను. ప్రతిభ చూపిన వారిని ఏడాది పొడవునా జరిగే శిక్షణకు ఎంపిక చేస్తాం.

– నాగేంద్ర, హాకీ కోచ్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, కాకినాడ

ఇష్టంతో చేరాను



నేను కాకినాడలో పదో తరగతి చదువుతున్నాను. హాకీపై ఉన్న ఇష్టంతో డీఎస్ఏ శిబిరంలో చేరాను. హాకీలో రాణించి స్పోర్ట్స్ కోటాలో ఇంజినీరింగ్ సీటు పొందడం నా లక్ష్యం.

– ప్రజ్ఞ

జాతీయ స్థాయి పతకమే లక్ష్యం



కాకినాడలో ఏడో తరగతి చదువుతున్నాను. హాకీలో రాణించి జాతీయ స్థాయిలో పతకం సాధించాలని ఈ శిక్షణలో చేరాను. జాతీయ జట్టుకు ఆడడం నా లక్ష్యం. ఉదయం, సాయంత్రం శిక్షణకు హాజరవుతున్నాను.

– సాయి



హాకీలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

కౌంటింగ్ అయ్యే వరకు బాణసంచాకు బ్రేక్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి మూర్తి

సామర్లకోట: ఓట్ల లెక్కింపు కార్యక్రమం పూర్తి అయ్యే వరకు బాణసంచా తయారీ నిలుపుదల చేయాలని జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి, సెట్రాజ్ సీఈఓ ఏవీఎస్ఎస్ మూర్తి ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాణసంచా తయారీదారుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన వారు సంబరాలు జరుపుకోవడానికి బాణసంచాను విక్రయించరాదన్నారు. విజయోత్సవాల్లో బాణసంచా కాల్చులు జరిపిన వారిని అదుపులోనికి తీసుకొని బాణసంచా విక్రయించిన వారి వివరాలు సేకరించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో సామర్లకోట మండలంలో నాలుగు, పెద్దాపురం మండల పరిధిలో మూడు చోట్ల శాశ్వత లైసెన్సులతో బాణసంచా తయారు చేస్తున్నారు. పెట్రోలు బంకుల నిర్వాహకులు లూజ్ పెట్రోల్ విక్రయించడం నేరం కిందకు వస్తుందని హెచ్చరించారు. బాటిల్స్, డబ్బాలు, పాలిథిన్ కవర్లలో పెట్రోలు కోసం వచ్చిన వారికి విక్రయాలు చేయవద్దని బంకుల నిర్వాహకులకు చెప్పారు. సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తహసీల్దార్ వై.శ్రీనివాసు, ఎస్సై మౌనిక, వీఆర్వోలు మురళి, కేవీవీ సత్యనారాయణ, అగ్నిమాపక అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంల భద్రత పరిశీలన

కాకినాడ: ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌లను కాకినాడ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు బుధవారం సందర్శించారు. రోజువారీ తనిఖీల్లో భాగంగా స్థానిక జేఎన్‌టీయూలోని స్ట్రాంగ్‌రూమ్‌ల తనిఖీకి వెళ్లిన ఆర్వో అక్కడి భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద మూడంచెల భద్రతతోపాటు సీసీ కెమేరాల నిఘా కూడా ఏర్పాటు చేశామన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లను ఇద్దరు గెజిటెడ్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తారన్నారు. అనంతరం ఎన్నికల కౌంటింగ్ సెంటర్‌ను కూడా ఆయన సందర్శించారు. అక్కడ కల్పిస్తున్న ఏర్పాట్లు, సదుపాయాలను పరిశీలించారు. ఆయన వెంట ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


శ్రీనివాస్ (ఫైల్)

తాళ్లపూడి: మండలంలోని సూర్యపేట రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. తాళ్లపూడి ఎస్సై టి.శ్యామ్‌సుందర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని గజ్జరం నుంచి సూరయ్యపేట వెళ్లే రహదారిలో కొవ్వూరు మండలం చిడిపి గ్రామానికి చెందిన బండారు శ్రీనివాస్ (25), ప్రక్కిలంక గ్రామానికి చెందిన దేరా లక్ష్మణ్ బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందగా, లక్ష్మణ్‌కు గాయాలయ్యాయి. స్థానికులు స్థానిక స్టార్ ఆస్పత్రికి తరలించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి సాయి ఆస్పత్రికి తరలించారు. లక్ష్మణ్, ఆస్పత్రి వర్గాల సమాచారంతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై శ్యామ్ సుందర్ తెలిపారు.

దివ్యాంగురాలిపై అత్యాచారం

అంబాజీపేట: ఒక మానసిక దివ్యాంగురాలిపై 55 ఏళ్ల వృద్ధుడు అత్యాచారం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు చిరతపూడి శివారు కట్టావారిపాలేనికి చెందిన 25 ఏళ్ల ఆ యువతి ఈ నెల 26వ తేదీ రాత్రి అమ్మవారి జాతర సందర్భంగా ఇరుగు పొరువారి వద్ద నుంచి బిర్యాని, కూర తెచ్చుకుందామని బయటకు వెళ్లింది. ఇదే అదునుగా భావించిన అదే ప్రాంతానికి చెందిన 55 ఏళ్ల కట్టా పాటియ్య అక్కడికి పక్కనే ఉన్న తోటలోకి తీసుకుపోయి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో ఆమె బిగ్గరగా వేయడంతో అటుగా వెళుతున్న మహిళలు స్థానికులకు సమాచారం ఇచ్చారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మొరాయించిన రైల్వే గేటు

మండపేట: అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం కేశవరం రైల్వే గేటు సాంకేతిక లోపంతో బిగుసుకుపోయింది. దాంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు. బుధవారం రాత్రి సుమారు 8.15 గంటల సమయంలో గూడ్స్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు రావడంతో రైల్వే గేట్ వేశారు. రైళ్లు వెళ్లిన అనంతరం అవి తెరుచుకోకుండా మొరాయించాయి. అర్ధరాత్రి దాటినా గేటు తెరుచుకోలేదు. గేట్‌మన్ ఉన్నతాధికారులకు సమాచారాన్ని ఇచ్చి గేటు మూతపడిందంటూ తాత్కాలికంగా అటు ఇటు బోర్డులు ఏర్పాటు చేశారు. ఇక చేసేది లేక ఇటు కడియం మీదుగా రాజమహేంద్రవరం వెళ్లేవారు, రాజమహేంద్రవరం నుంచి మండపేట అనపర్తి వైపు వచ్చే వాహనాలు కేశవరం ఊరిలో నుంచి పంచాయతీరాజ్ రోడ్డు మీదగా జెడ్ మేడపాడు, ద్వారపూడి ఫ్లైఓవర్ మీదుగా రాకపోకలు సాగించారు.

తేరుకు రక్షణ ఈ తీరునా?


సత్యదేవుని రథోత్సవం (ఫైల్)


రథోత్సవం అనంతరం పంపాసత్రం ఆవరణలో కొలువై ఉన్న రథం


ఈఓ కార్యాలయం వద్ద ఉంచిన స్వామివారి ఊరేగింపునకు వినియోగించే వెండి వాహనాలు

- గతం నుంచి పాఠాలు నేర్వని అధికారులు
- రూ.1.08 కోట్ల వ్యయంతో నిర్మించిన సత్యరథానికి రత్నగిరిపై స్థలమే కరవు
- ఇక్కడ కాదని అక్కడ.. అక్కడ కాదని ఇంకోచోట..
- ఇంకా ప్రతిపాదనల స్థాయిలోనే షెడ్డు నిర్మాణం

అన్నవరం: రత్నగిరీశుడైన సత్యదేవుడు, అనంతలక్ష్మీ, సత్యవతీదేవి అమ్మవార్లను ఊరేగించేందుకు రూ.1.08 కోట్ల వ్యయంతో టేకు కలపతో 36 అడుగుల ఎత్తైన రథాన్ని నిర్మించిన దేవస్థానం దాని రక్షణకు ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సత్యదేవుని దివ్య కల్యాణ మహోత్సవాలలో భాగంగా ఈనెల 22వ తేదీన స్వామి, అమ్మవార్లను ఆ రథంపై ఘనంగా ఊరేగించిన విషయం తెలిసిందే.

ఊరేగింపు అనంతరం అదే రోజు రాత్రి ఆ రథాన్ని పంపా సత్రం వద్దకు తీసుకువెళ్లి ఉంచారు. అక్కడ నిలిపిన తరువాత రెండు సార్లు వర్షం కురిసింది. 24వ తేదీన సుమారు మూడు గంటల పాటు భారీ వర్షం కురిసింది. ఆ వర్షానికి ఈ రథం పూర్తిగా తడిసిపోయింది. ఆ తరువాత ఎండలు కాస్తుండడంతో రథం పరిస్థితి వానకు తడవడం, ఎండకు ఎండడంలా తయారైంది.

రథం భద్రత ప్రశ్నార్థకం

ప్రస్తుతం పంపా సత్రం ఆరుబయట ఉన్న రథం భద్రత కూడా ప్రశ్నార్థకంగా మారింది. 2020 సెప్టెంబర్ నెలలో అంతర్వేది దేవస్థానంలో స్వామివారి ఊరేగింపు రథం అగ్నిప్రమాదంలో దగ్ధమవడంతో రాష్ట్రంలోని అన్ని దేవస్థానాల రథాలకు, ఊరేగింపు వాహనాలకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాదిపదికన రక్షణ ఏర్పాట్లు చేసింది. ఇక్కడి స్వామివారి ఊరేగింపు వాహనాలను కూడా హుటాహుటిన రత్నగిరికి తరలించారు. తరలించే వీలు లేని రావణబ్రహ్మ వాహనం, పొన్నచెట్టు వాహనం ఉన్న షెడ్డుకు ఇనుప షట్టర్లు ఏర్పాటు చేసి సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేశారు.

ఆ అనుభవంతో సాధ్యమైనంత త్వరగా రథానికి షెడ్డు నిర్మించి భద్రపరచాల్సి ఉంది. అలాగే రథానికి షెడ్డు నిర్మించేవరకు ఎండా, వానల నుంచి రక్షణకు కనీసం దళసరి టార్పాలిన్ లాంటిది కప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కానీ అటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు.

షెడ్ నిర్మాణానికి స్థలమే కరువా?

అయితే ప్రస్తుతం ఈ రథాన్ని ఈ విధంగా రత్నగిరికి తరలించడం సాధ్యం కాదు. అందువల్ల కొండదిగువన రథం కోసం షెడ్డు నిర్మించాల్సి ఉంది. గతంలో ఈ రథం కోసం ఆర్యవైశ్య సత్రం ఎదురుగా గల కొండను తొలిచి అక్కడ షెడ్డు నిర్మించాలని, కాకుంటే పంపా సత్రం వద్ద నిర్మించాలని భావించారు.

ప్రస్తుతం దేవస్థానం మొదటి టోల్‌గేట్ సమీపంలోని గ్యారేజ్ వద్ద ఈ షెడ్డు నిర్మించాలని భావిస్తున్నట్లు సమాచారం.

అయితే రథోత్సవం ప్రారంభయ్యే తొలిపావంచాకు దగ్గరగా గల పాత ఈఓ క్వార్టర్స్ స్థలంలో కాని, లేదా సత్యనికేతన్ వెనుక గల ఖాళీ స్థలంలో కాని రథం భద్రతకు షెడ్డు నిర్మిస్తే బాగుంటుందన్న పలువురు అభిప్రాయపడుతున్నారు. పంపా సత్రం లేదా, గ్యారేజీ వద్ద షెడ్డు నిర్మిస్తే అక్కడ నుంచి తొలిపావంచా వద్దకు రథం లాక్కుని రావడం, ఊరేగింపు అయ్యాక మళ్లీ అక్కడకు తీసుకువెళ్లడం చాలా కష్టంతో కూడుకున్న పని. వందలాది మంది లాగితే తప్ప రథం కదలని పరిస్థితి.

> **రథానికి షెడ్డు నిర్మిస్తాం..**
>
> 
>
> సత్యదేవుని రథానికి షెడ్డు నిర్మించాలని నిర్ణయించాం. త్వరలోనే ట్రస్ట్ బోర్డు సమావేశంలో ఎక్కడ నిర్మించాలనే దానిపై చర్చిస్తాం. దేవస్థానం గ్యారేజీ స్థలం వద్ద షెడ్డు నిర్మిస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. షెడ్డు నిర్మాణం పూర్తయ్యేవరకు రథం వర్షానికి తడవకుండా, ఎండకు ఎండకుండా కవర్ కప్పాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించాము. రథానికి నాలుగు వైపులా సీసీ టీవీ కెమేరాలు కూడా అమర్చుతున్నారు.
>
> – కె.రామచంద్రమోహన్, ఈఓ, అన్నవరం దేవస్థానం

తేనెటీగల దాడిలో 20 మందికి గాయాలు


తేనెటీగల దాడిలో గాయపడిన క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో సీహెచ్‌సీకి తరలిస్తున్న దృశ్యం


పి.గన్నవరం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న ఉపాధి కూలీ

పి.గన్నవరం: మండలంలోని నరేంద్రపురంలో పంట కాలువ పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి కూలీలపై మన్యం తేనెటీగలు దాడి చేశాయి. ఈ దాడిలో గాయపడిన 20 మంది కూలీలను స్థానిక సీహెచ్‌సీకి తరలించి వైద్యం చేశారు. నరేంద్రపురం శివారు బూరుగుగుంట హేబిటేషన్ పరిధిలోని పంట కాలువలో 192 మంది కూలీలు పూడిక తీస్తున్నారు. వారిలో ఒక బృందంపై తేనెటీగలు తాడి చేయడంతో గాయపడిన వారిని స్థానికులు, తోటి సిబ్బంది, ఏపీఓ సీహెచ్.లక్ష్మీనారాయణ స్థానిక సీహెచ్‌సీకి ఆటోలు, 108 అంబులెన్స్‌లో తరలించారు. వైద్యాధికారి యు.రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది క్షతగాత్రులకు వైద్య సేవలు అందించారు. వారిలో భీమవరపు యశోద పరిస్థితి విషమించడంతో ఆమెను అమలాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎంపీడీఓ సీహెచ్.త్రిశూలపాణి క్షతగాత్రులను పరామర్శించారు.

అంత్యక్రియలకు వెళ్లిన 8 మందిపైనా..

అంబాజీపేట: స్థానిక హడ్కోకాలనీ సమీపంలోని శ్మశానవాటికకు అంత్యక్రియలకు వెళ్లినవారిపై తేనెటీగలు దాడి చేయడంతో ఎనిమిది మంది గాయపడ్డారు. కొర్లపాటివారిపాలేనికి చెందిన కోటిపల్లి సత్యవతి (84) మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు బుధవారం దహన సంస్కారాలకు శ్మశానానికి తీసుకువెళ్లారు. దహన సంస్కారం అనంతరం అక్కడి రావిచెట్టుపై ఉన్న తేనెపుట్ట నుంచి ఒక్కసారిగా తేనెటీగలు వచ్చి వారిపై దాడి చేశాయి. దీంతో వారంత అర కిలోమీటరు దూరం పరుగులు తీశారు. క్షతగాత్రులను స్థానిక అంబాజీపేట పీహెచ్‌సీకి తరలించగా వైద్యాధికారి బి.కె.శ్రీనివాస్, స్టాఫ్ నర్స్ విజయ వైద్యం అందిచారు

వీడిన మహిళ హత్య మిస్టరీ

- ప్రైవేట్ కంపెనీలో ప్రొడక్షన్ మేనేజరే హంతకుడు
- బలంగా గొంతు నొక్కడం వల్లే ఊపిరాడక మృతి


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ సీఐ ఎస్‌వీవీఎస్ మూర్తి


హత్య అనంతరం మహిళ మృతదేహాన్ని తరలించిన వాహనం


కొర్రా కుమారి (ఫైల్)

తుని రూరల్: తుని మండలం తేటగుంట శివారు టి.వెంకటాపురం గ్రావెల్ రోడ్డులో గుర్తు తెలియని మహిళ హత్య కేసు మిస్టరీ వీడింది. అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలం నక్కలమెట్ట గ్రామానికి చెందిన కొర్రా కుమారి (28) హత్యకు గురైనట్టు రూరల్ పోలీసులు గుర్తించారు. హత్యకు గల కారణాలను బుధవారం తుని రూరల్ సర్కిల్ కార్యాయంలో సీఐ ఎస్‌వీవీఎస్ మూర్తి విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. రూరల్ సీఐ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొర్రా కుమారి కొంతకాలంగా తునిలో నివాసం ఉంటూ ఆర్టీసీ కాంప్లెక్సు, రైల్వే స్టేషన్ల మధ్య తిరుగుతూ గుట్టుగా జీవనోపాధి పొందుతోంది. తెలంగాణ రాష్ట్రం మధిరకు చెందిన నందిగం ప్రవీణ్ అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం కేశవరంలో ఉన్న డెక్కెన్ కంపెనీలో ప్రొడక్షన్ మేనేజరుగా పని చేస్తున్నాడు. పాయకరావుపేటలో ఉంటున్న ప్రవీణ్ ఆ రోజు తన భార్య ఆమె బంధువుల ఇంటికి మరో ఊరు వెళ్లడంతో అతడు మద్యం తాగి అప్పటికే పరిచయం ఉన్న కొర్రా కుమారిని ఆ రోజు రాత్రికి కొంత మొత్తం నగదు చెల్లించి ఇంటికి తెచ్చుకున్నాడు. లైంగిక వాంఛ తీర్చాలని బలవంతం చేయడంతో ఆమె కేకలు వేసింది. దీంతో ఆగ్రహించిన ప్రవీణ్ ఆమెను దవడపై బలంగా కొట్టాడు. దీంతో ఆమె మరింత గట్టిగా కేకలు వేసింది. చుట్టుపక్కల వారు వస్తారన్న అనుమానంతో ఆమె చేతులను, గొంతును గట్టిగా అదిమిపెట్టడంతో ఊపిరాడక ఆమె మృతి చెందింది. ఈ హత్య ఆనవాళ్లు తెలియకుండా చేసేందుకు ప్లాస్టిక్ టేపుతో చేతులను నడుముకు చుట్టి, మృతదేహానికి తెల్లటి దుప్పటి చుట్టి నలుపు రంగు ట్రావెల్ సూట్ కేసులో పెట్టి తన స్నేహితుడి స్కూటీ మధ్య భాగంలో కాళ్ల దగ్గర పెట్టుకుని జాతీయ రహదారిపై పాయకరావుపే నుంచి తుని, జగన్నాథగిరి, వి.కొత్తూరు మీదగా రాజులు కొత్తూరు సమీపంలోగల టి.వెంకటాపురం గ్రావెల్ రోడ్డుకు చేరుకున్నాడు. నిర్మానుష్యంగా ఉన్న గ్రావెల్ రోడ్డులో ఆ మృతదేహాన్ని పడేసి తిరిగి తన నివాసానికి వెళ్లిపోయాడు. 19న ఉదయం అటుగా వెళ్లే స్థానికుల సమాచారంతో తేటగుంట-2 వీఆర్వో వద్దాది సత్యనారాయణ రూరల్ పోలీస్‌కు ఫిర్యాదు చేశాడన్నారు.

దర్యాప్తు సాగిందిలా..

గుర్తు తెలియని మహిళ హత్యగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ఆదేశాలతో డీఎస్పీ కె.లతాకుమారి పర్యవేక్షణలో రూరల్ సీఐ ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు ప్రారంభించారు. తుని రూరల్, కోటనందూరు, తుని పట్టణం, కోరంగి ఎస్సైలు రమేష్ బాబు, శంకరరావు, విజయబాబు, రవికుమార్, పెద్దాపురం సబ్ డివిజన్ పోలీసులు, సాంకేతిక సిబ్బందితో కేసును చేధించారు. హత్యకు పాల్పడిన ప్రవీణ్‌ను మంగళవారం మధ్యాహ్నం తుని మండలం ఎర్రకోనేరు సమీపంలో అరెస్టు చేసినట్టు సీఐ మూర్తి వివరించారు. స్కూటీ, ట్రావెల్ సూట్‌కేసు, ప్లాస్టిక్ టేపును స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు. కేసు పురోగతికి కృషి చేసిన ఎస్సైలకు, పోలీసులకు, సాంకేతిక సిబ్బందికి సీఐ నగదు రివార్డులను సీఐ అందజేశారు.

260.72 కిలోల గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయి, అరెస్టు చేసిన నిందితులతో సెబ్ సౌత్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హనుశ్రీ

- నర్సీపట్నం నుంచి చెన్నైకి రవాణా
- గూడ్స్ వ్యాన్, సెల్‌ఫోన్లు, నగదు స్వాధీనం
- నలుగురి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: నర్సీపట్నం నుంచి తమిళనాడు రాష్ట్రం చెన్నైకు గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో మంగళవారం రాత్రి సెబ్ సౌత్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ, సిబ్బందితో దివాన్‌చెరువు జీరో పాయింట్ వద్ద తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ఏపీ07 టీఎఫ్ 1136 నెంబరు గల గూడ్స్ వెహికల్‌లో 260.072 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని తమిళనాడుకు చెందిన ఎస్.ఆనందవేలు, ఎస్.మురుగన్, కిషోర్‌కుమార్, మహిందర్‌లను అదుపులోకి తీసుకుని వారి నుంచి ఐదు సెల్‌ఫోన్లు, రూ.3 వేలను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. నర్సీపట్నం ఏజెన్సీ ప్రాంతంలో గంజాయిని కొనుగోలు చేసి తమిళనాడుకు తరలిస్తున్నారన్నారు.

స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ ఇక్కడి లెక్కల ప్రకారం రూ.15.74 లక్షలని, తమిళనాడులో దాని విలువ రూ.38.10 లక్షలు ఉంటుందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో చింతపల్లి, పాడేరులో గిరిజన గ్రామాల నుంచి తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ తెలిపారు. ఈ దాడులలో ఎస్సై వై.దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సారా, మద్యం సీసాలతో..

మధురపూడి: కోరకొండ సెబ్ కోరుకొండ సర్కిల్ కార్యాలయం పరిధిలో 200 లీటర్ల నాటు సారా, 80 మద్యం సీసాలతో పలువురు వ్యక్తులను బుధవారం అరెస్టు చేసినట్టు సీఐ బంగారు రాజు తెలిపారు. గోకవరం మండలం కామరాజుపేట, తిరుమలాయపాలెం, గోకవరం గ్రామాల్లో సీతానగరం మండలం రఘుదేవపురం, కాటవరం గ్రామాల్లో బుధవారం దాడులు నిర్వహించినట్టు తెలిపారు. ఈ గ్రామాలకు చెందిన సంగుల శివప్రసాద్, వనుం నాగమణి, బొందెల అప్పారావు, నీలం వీరబాబు తదితరులను అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి 200 లీటర్లు నాటు సారా, 80 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపర్చినట్టు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్సై వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

వేద విద్య కాలాతీతం

- టీటీడీ వేదిక్ వర్సిటీ వేద భాష్య ఆచార్యులు ఫణియాజులు


గంగలకుర్రులో వేద పట్టాలు పంపిణీ చేస్తున్న పండితులు

అంబాజీపేట: తరాలు మారుతున్నా వేద విద్య కొనసాగుతూనే ఉంటుందని టీటీడీ వేదిక్ యూనివర్శిటీ వేద భాష్య ఆచార్యులు దువ్వూరి యజ్ఞేశ్వర ఫణియాజులు ఉద్ఘాటించారు. మండలంలోని గంగలకుర్రులో మూడు రోజులుగా జయంతి భాస్కర సుబ్రహ్మణ్యం స్వగృహంలో జరిగిన శ్రీ గోదావరి మండల వేద శాస్త్ర ప్రవర్ధక సభ చారిటబుల్ ట్రస్ట్ 73వ వార్షికోత్సవాలు బుధవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా నిర్వహించిన వేద విద్వత్ మహాసభకు ట్రస్ట్ అధ్యక్షుడు చిట్టావఝుల వెంకట సూర్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫణియాజులు మాట్లాడుతూ వేదాన్ని సేవించినంత కాలం సమాజ స్థాపన జరుగుతూనే ఉంటుందన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పి.కె.రావు మాట్లాడుతూ మానవ మనుగడకు వేదాలే మూలమన్నారు. తొలుత సుమారు 300 మంది వేద పండితులు నిర్వహించిన వేద స్వస్తితో గ్రామం వేద ఘోషతో పులకరించింది.

17 మందికి వేద పట్టాల పంపిణీ

గత మూడు రోజులుగా నిర్వహించిన వేద పరీక్షలలో 17 మందికి పూర్తి స్థాయి వేద పట్టాలు పంపిణీ చేసినట్టు ట్రస్ట్ కార్యదర్శి ఆకెళ్ల వెంకట రామకృష్ణ కామేశ్వర శర్మ, సహాయ కార్యదర్శి యేడిద సుబ్రహ్మణ్య శర్మ తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ సూపర్ వైజర్ గుళ్లపల్లి దత్తాత్రేయ ఘనాపాఠి, కడియాల సీతారామ వధాని, ట్రస్ట్ కోశాధికారి అయ్యగారి లక్ష్మీనరసింహ మూర్తి, సహాయ కార్యదర్శి భమిడిపాటి యజ్ఞేశ్వర ప్రసాద్, వేదపండితులు కర్రా దత్తు, ఆకెళ్ల నారాయణమూర్తి పాల్గొన్నారు.

లారీ ఢీకొనడం వల్లే ప్రమాదం

- కోడూరుపాడు ప్రమాద ఘటనలో కీలక మలుపు
- సీసీ టీవీ ఫుటేజ్‌ల ఆధారంగా కేసు పురోగతి


ప్రమాదంలో నుజ్జయిన కారు

హనుమాన్‌జంక్షన్ రూరల్: చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారిపై బాపులపాడు మండలం కోడూరుపాడు వద్ద ఈ నెల 27న జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై పోలీసుల దర్యాప్తు కీలక మలుపు తిరిగింది. ఈ ప్రమాదంలో తమిళనాడుకు చెందిన ఒకే కుటుంబంలోని నలుగురు దుర్మరణం చెందగా, మరొకరు ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చేరారు. అతి వేగమే ఈ ఘటనకు కారణమని ప్రాథమికంగా గుర్తించినా వీరవల్లి పోలీసుల దర్యాప్తులో అసలు వాస్తవాలు వెలుగులోకి చూస్తున్నాయి. తమిళనాడులోని దిండిగల్ జిల్లా వేదసంతూర్‌కు చెందిన స్వామినాథన్ కుటుంబం పదేళ్లుగా తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని అడ్వకేట్ కాలనీలో నివసిస్తున్నారు. స్థానికంగా ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్న స్వామినాథన్ తమిళనాడులోని సొంతూరులో ఓ శుభకార్యానికి కుటుంబంతో కారులో వెళ్తుండగా బాపులపాడు మండలం కోడూరుపాడు సమీపంలోని పెట్రోలు బంకు వద్ద ఐదో నంబర్ జాతీయ రహదారిపై ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జయ్యి డ్రైవింగ్ చేస్తున్న స్వామినాథన్ (40), అతని కుమార్తె రాధా ప్రియ (14), కుమారుడు రాకేష్ (12), సోదరుడి కుమారుడు గోపి (23) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. కారులో ప్రయాణిస్తున్న స్వామినాథన్ భార్య సత్య (38) తీవ్ర గాయాలతో విజయవాడలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు.

టైరు గుర్తులతో..

ఘటనాస్థలాన్ని ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ, గన్నవరం డీఎస్పీ ఆర్.జయసూర్య, ట్రైనీ డీఎస్పీ వేదశ్రీ పరిశీలించిన తరుణంలో పలు ఆసక్తికర విషయాలు చర్చకు వచ్చాయి. ప్రమాదస్థలి వద్ద లారీ టైరు గుర్తులు కనపడడంతో అనుమానించి సమీపంలోని సీసీ ఫుటేజీని, ఆత్కూరు టోల్‌గేట్ సీసీ టీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. గేదేలు లోడుతో వెళ్తున్న లారీ అతి వేగంగా కారును ఢీకొనడం వల్లే కారు అదుపుతప్పి డివైడర్‌ను దాటి ఆవైపు రోడ్డులో ఎదురుగుగా వస్తున్న లారీని ఢీకొన్నట్టు తేలింది. కాగా జాతీయ రహదారిపై చిలకలూరిపేట సమీపంలో ఆ లారీని నిలిపి డ్రైవర్ పరారైనట్టు పోలీసులు గుర్తించి లారీని అదుపులోకి తీసుకున్నారు.

వుడయార్‌కు 'అంబేడ్కర్ ఎక్సెలెన్సీ'


శిల్పి రాజ్‌కుమార్ వుడయార్

కొత్తపేట: ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డి.రాజ్‌కుమార్ వుడయార్ హైదరాబాద్ కళానిలయం కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ వారి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎక్సలెన్సీ అవార్డుకు ఎంపికయ్యారు. తద్వారా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదయ్యారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలకు అత్యధిక సంఖ్యలో అంబేడ్కర్ విగ్రహాలు నిర్మించినందుకు గుర్తుగా ఆ సంస్థ ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. అంబేడ్కర్ 133వ జయంతి వేడుకల్లో భాగంగా గురువారం సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో వుడయార్‌కు పురస్కారం ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు ఆ విషయాన్ని స్థానిక విలేకరులకు ఆయన తెలిపారు.

2 వేల అంబేడ్కర్ విగ్రహాల రూపకల్పన

తాను రూపొందించిన సుమారు 3,500 జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు, చరిత్రకారులు, రాజకీయ నాయకులు, సంఘ సంస్కర్తల విగ్రహాల్లో సుమారు 2 వేలు వరకూ అంబేడ్కర్ విగ్రహాలే ఉన్నాయని శిల్పి రాజ్‌కుమార్ తెలిపారు. అనేక వర్సిటీలతో పాటు ఇతర రాష్ట్రాల్లోని వర్సిటీలు, ఇతర సంస్థల్లో తాను రూపొందించిన అంబేడ్కర్ విగ్రహాలు ఉన్నాయన్నారు. 1950లో స్టూడెంట్‌గా ఉన్న తన తండ్రి, అప్పటి యువ శిల్పి శ్రీనాథ రత్నశిల్పి వుడయార్‌ను ఢిల్లీలో అంబేడ్కర్ చేతులు మీదుగా బెస్ట్ యువశిల్పి అవార్డుతో సత్కరించారని రాజ్‌కుమార్ గుర్తు చేసుకున్నారు. అలాగే తనను సైతం అంబేడ్కర్ మనుమడు ప్రకాష్ అంబేడ్కర్ సత్కరించారని తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్‌పై సమావేశం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): వచ్చే నెల 29న ఉమ్మడి జిల్లాలో జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌పై జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత బుధవారం సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ న్యాయవాదులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ వచ్చే నెలలో జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో సివిల్ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, మోటారు వాహనాల యాక్సిడెంట్, చెక్ బౌన్స్, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని కేసులను గుర్తించి, ఆ జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలన్నారు. అనంతరం జాతీయ లోక్ అదాలత్‌పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.